
సాక్షి ఒడిశా

సోమవారం । 7 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,92,965లు, బంగారం 1గ్రాము, వెండి 10.94 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్ట్



జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని టంకువ పంచాయతీ కుసుముపుట్ గ్రామానికి చెందిన రమేష్ హరిజన్(26)ను సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ అధికారి సంజయకుమార్ కండి వెల్లడించారు.

శాంతి నెలకొల్పాలి



జయపురం: మణిపూర్‌లో తలెత్తిన హింసాత్మక ఘటనలు, హర్యాణా రాష్ట్రంలో జరుగుతున్న మత పరమైన అల్లర్లను వెంటనే అరికట్టాలని, శాంతి నెలకొల్పాలని సీపీఐ కొరాపుట్ జిల్లాశాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ శ్రేణులు జయపురంలో ర్యాలీ చేపట్టారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు జాతీయ అవార్డు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కేంద్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో విద్యార్థులకు ఈ–లైబ్రరీల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ కేంద్రప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఉన్నత విద్యాశాఖ ఆయనను అవార్డుతో సత్కరించారు. గజపతి జిల్లాలో 50కి పైగా ఆశ్రమ పాఠశాలలు, బ్లాక్ స్థాయిలో మరో 25 లైబ్రరీలు ఏర్పాటు చేయడంతో గ్రంథాలయ ఉత్సవాలు–2023కు ఆయన ఎంపికయ్యారు. దీనిపై జిల్లా వర్గాలు హర్షం వ్యక్తంచేశారు.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు



తపన్‌కుమార్

భువనేశ్వర్: ఖుర్దాలో తాజాగా ఓ మోసపూరిత సర్టిఫికెట్ ముఠా గుట్టు రట్టయ్యింది. ఈ వ్యవహారంలో జాజ్‌పూర్‌కు చెందిన ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కైపాదారా కళాశాలలో రాజనీతి శాస్త్రం అధ్యాపకుడిగా పనిచేసిన తపన్‌కుమార్ పృష్టిని నిందితుడిగా గుర్తించారు. దధిమచ్ఛొగొడియాకు చెందిన ప్లస్2 విద్యార్థి నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంలో ఫిర్యాదు చేయడంతో గుట్టు రట్టయ్యింది. రూ.33వేలు వసూలు చేసి, ప్లస్2 ఉత్తీర్ణత సర్టి ఫికెట్‌కు బదులుగా నకిలీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ఉత్తీర్ణత సర్టిఫికేటు విక్రయించినట్లు ఆరోపణ. ఈ వ్యవహారానికి సంబంధించి లోతుగా విచారణ కొనసాగుతోంది. ఖుర్దాలో మోసపూరిత సర్టిఫికేట్ ముఠా గుట్టురట్టు కావడంతో సర్వత్రా కలకలం రేగింది.

నీటి పారుదల కార్యాలయంలో విషసర్పం



సర్పాన్ని బంధిస్తున్న హెల్ప్‌లైన్ సిబ్బంది

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో గత కొన్ని రోజులుగా నాగపాము తిరుగాడుతూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో నీటి పారుదల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ పట్నాయక్ స్నేక్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. హెల్ప్‌లైన్ సిబ్బంది అక్కడికి చేరుకొని, సర్పాన్ని బంధించడంతో పాటు సమీపంలోని అడవిలో విడిచి పెట్టారు.

పర్లాకిమిడిలో ఫ్రెండ్ షిప్ డే



కేక్ కట్ చేస్తున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: స్నేహితుల దినోత్సవాన్ని బీజేడీ నేతలు పర్లాకిమిడి లోని గణేష్ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ చైర్మన్, బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి కేక్ కట్ చేసి, స్నేహితులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేడీ కార్యదర్శి ప్రదీప్ నాయక్, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, యువజన నాయకులు శాసనం లింగరాజు, మిట్టు పాఢి, జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, న్యాయవాది కృష్ణమోహన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక.. ఆకాంక్షలకు ప్రతీక



ఖుర్దారోడ్ అమృత భారత్ స్టేషన్ నమూనా

- అమృత్ భారత్ స్టేషన్ల శంకుస్థాపనలో ప్రధాని మోదీ
- 508 స్టేషన్ల పునరాభివృద్ధికి వర్చువల్‌గా శ్రీకారం
- రాష్ట్రంలో 25 అమృత్ భారత్ స్టేషన్లు
- ఖుర్దారోడ్‌లో జరిగిన కార్యక్రమానికి గవర్నర్ గణేషీలాల్ హాజరు



విజేతకు బహుమతి అందిస్తున్న గవర్నర్



వేదికపై గవర్నర్ గణేషీలాల్, ఎంపీ మున్నా ఖాన్



అమృత్ భారత్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ

భువనేశ్వర్: అమృత్ భారత్ స్టేషన్.. ఆధునిక ఆకాంక్షలు, ప్రాచీన వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 25, దేశ వ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి ఆయన ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో రాజ్యసభ సభ్యుడు ముజీబుల్లా(మున్నా) ఖాన్, జట్నీ ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్, తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తొలి విడత కింద ఈ స్టేషన్ల నిర్మాణం వ్యయ ప్రణాళిక రూ.24,470 కోట్లుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సమగ్రంగా 1300 ప్రధాన రైల్వే స్టేషన్లను అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. తొలి విడతలో 508 స్టేషన్లను ఎంపిక చేశామన్నారు. ఈ రైల్వే స్టేషన్లలో పర్యటన, ఆర్థిక కార్యకలాపాల పురోగతికి ప్రోత్సహిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. స్థానిక కళాకారులు, వృత్తి చేతి పనుల కార్మికుల ప్రోత్సాహానికి ఒక స్టేషన్–ఒక ఉత్పత్తి పథకం విజయవంతం అవుతుందని తెలిపారు.

రూ.547.7 కోట్లతో..

రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ రానున్న 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా స్టేషన్ల పునరాభివృద్ధిని వ్యూహాత్మక దృక్పథంతో ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 25 అమృత్ భారత్ స్టేషన్లలో అత్యధికంగా ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో 11 స్టేషన్లు చోటు దక్కించుకున్నాయని పేర్కొన్నారు. దీనికిగాను రూ.547.7 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ జాబితాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలోని సాక్షి గోపాల్, మంచేశ్వర్, ఢెంకనాల్, ఛత్రపూర్, అంగుల్, మెరమండలి, బలుగాంప్, లింగరాజ్ టెంపుల్ రోడ్, తాల్చేర్ రోడ్, ఖుర్దా రోడ్, కంటాబంజీ, బర్‌గడ్ రోడ్, హిరాకుడ్, రైరాఖోల్, బర్‌పాలి, మునిగుడ, బొలంగీర్, హరిశంకర్ రోడ్, భవానీపట్నా, ఖరియార్ రోడ్, దామన్‌జోడి, ఆగ్నేయ రైల్వే పరిధిలో(ఎస్ఈ) కింద బర్బిల్, రాజ్‌గంగ్‌పూర్, బరిపద, జలేశ్వర్ స్టేషన్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ స్టేషన్లతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో పలాస, విజయనగరం, దువ్వాడ స్టేషన్లు, ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్ స్టేషన్లు తూర్పుకోస్తా రైల్వేజోన్ అమృత్ భారత్ స్టేషన్ తొలి దశ జాబితాలో చోటు చేసుకున్నట్లు వివరించారు.



లింగరాజ్ టెంపుల్ రోడ్ నమూనా

విజేతలకు బహుమతులు..

లింగరాజ్ టెంపుల్ రోడ్ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత, ప్రభుత్వరంగ సంస్థలు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖామంత్రి అశోక్‌చంద్ర పండా, మంచేశ్వర్ రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, స్థానిక ఎమ్మెల్యే సుశాంత్‌కుమార్ రౌత్ అతిథులుగా పాల్గొన్నారు. ఖుర్దారోడ్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ల శంకుస్థాపన కార్యక్రమం పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు గవర్నర్ బహుమతులు అందజేశారు.

బాధితులను పరామర్శించిన ఎంపీ

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎంపీ సప్తగిరి

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీ లోని ఉపారొసాజ్జా గ్రామ బాధితులను ఆదివారం పరామర్శించారు. నిర్మాణ దశలో ఉన్న కల్వర్టుకు సంబంధించిన సెంట్రింగ్ కూలిపోయిన దుర్ఘటనలో ఐదుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంపీ సప్తగిరి ఆ గ్రామంలో పర్యటించి, బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య కారణంగా చిన్నారులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబంలోని వారికి ప్రభుత్వం తరుపున అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాల్లోని చిన్నారుల చదువు, భవిష్యత్ బాధ్యత కూడా ప్రభుత్వమే భరించాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఆయా కుటుంబంలోని వారికి కల్పించాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడ్ల వర ప్రసాదరావు ఉన్నారు.

పర్లాకిమిడిలో రోజంతా వర్షం



ఎస్‌కేసీజీ కళాశాలలో పడుతున్న వర్షం

పర్లాకిమిడి: జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతల వారీగా వర్షం కురిసింది. గత 2రోజులుగా ఉక్కపోతతో అవస్థలు ఎదుర్కొన్న ప్రజలు.. ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. అలాగే జిల్లాలోని రామసాగరం, మహేంద్రతనయ నదిలో కొత్త నీరు చేరింది. దీంతో మెట్ట ప్రాంతాల్లో వరి ఉభాలు చేసేందుకు ఉపయోగకరంగా ఉంటుదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

జయపురం: స్థానిక సబ్ డివిజన్ కుంద్రా సమితిలో విద్యుత్ షాక్‌కు గురై, మహిళ మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రికలో చేరారు. మృతురాలు సయిత జానీ(26), బాధితురాలు తిలోత్తమ జానీ(18)గా పోలీసులు తెలిపారు. కుంద్రా సమితి బంశుయగుడ గ్రామానికి చెందిన సయిత శుక్రవారం సాయంత్రం తన ఇంటి మేడపై ఉన్న బట్టలు తీస్తుండగా సమీపంలోని విద్యుత్ తీగ తగలడంతో హాహాకారాలు చేసింది. ఆమెను రక్షించేందుకు వెళ్లిన తిలోత్తమ జానీ సైతం విద్యుత్ ఘాతానికి గురై, కిందపడింది. గమనించిన స్థానికులు ఇరువురినీ సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. సయిత అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన తిలోత్తమకు చికిత్స అందిస్తున్నారు. సయిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబానికి ఆర్థికం సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నకిలీ గుట్కా కర్మాగారంపై దాడి

- యంత్రాలు, తయారీ సామగ్రీ స్వాధీనం



కర్మాగారంలో నకిలీ గుట్కా తయారీ యంత్రాలు



గుట్కా తయారీ సామగ్రి, లేబుళ్లు

బరంపురం: నగరంలోని గత కొంతకాలంగా అక్రమంగా నిర్వహిస్తున్న గుట్కా తయారీ కేంద్రాలపై బరంపురం జిల్లా పోలీసులు దాడులు చేపట్టారు. ఎస్‌డీపీఓ జయంత్‌కుమార్ పాత్రో అందించిన సమాచారం ప్రకారం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలోని భైరవి నగర్‌లో నడుస్తున్న కర్మాగారంలో రూ.6 లక్షల విలువైన గుట్కా తయారీ సామగ్రి, లేబుళ్లు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. యజమాని దివ్యాన్ష్ బెహరా, సరత్ బిశాయి, కాశీనాథ్ బెహరాగా గుర్తించామని ఎస్‌డీపీఓ తెలిపారు.

శ్రీమందిరంలో మహాస్నానం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం సాయంత్రం సర్వదర్శనం ప్రభావితమైంది. సుమారు రెండున్నర గంటలు భక్తుల దర్శనాలను నిరవధికంగా నిలిపివేశారు. గర్భాలయంలో ద్వితీయ భోగ మండప సేవ ముగిసి, మైలమ్ సేవ ప్రారంభించే ముందు గర్భాలయం ఆవరణ భిత్తొరొ కథొ ప్రాంగణంలో యాత్రికులు వాంతి చేసినట్లు గుర్తించారు. దీంతో శుద్ధి కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా భిత్తొరొ కథొ ప్రాంగణంలో చున్నపు నీరు చల్లి శుద్ధి చేశారు. అనంతరం మూల విరాట్‌లకు మహాస్నాన సేవ నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభించిన ఈ కార్యకలాపాలు రాత్రి 7.35 గంటల వరకు నిరవధికంగా కొనసాగాయి. అనంతరం మూల విరాట్‌లకు మైలమ్ సేవ ముగించి, సాధారణ భక్తులకు లోపలికి ప్రవేశించేందుకు అనుమతించారు.

వ్యాపారి హత్యకు పన్నాగం

- 8మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



గొంతుపై కత్తి పోటుతో రఘునాథ్



రఘునాథ్ సింగారియ(ఫైల్)

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలోని బనువగుడ గ్రామం సమీపంలో ఉన్న నీలగిరి తోటలో ఓ చిరు వ్యాపారిని గొంతుకోసి హత్య చేసేందుకు దుండగులు ప్రయత్నించారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యాపారిని గ్రామస్తులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై వివరాల ప్రకారం బలియగుడ గ్రామానికి చెందిన రఘునాథ్ సింగారియ(55) తన హోటల్ సామగ్రీ కొనుగోలు నిమిత్తం బాలగుడ వెళ్లి, చీకటి పడ్డాక తిరిగి వస్తుండగా దాదాపు 8మంది దుండగులు అడ్డగించారు. అతను ప్రతిఘటించడంతో ఝొడంగా గ్రామానికి చెందిన పద్మణ హరిజన్ కత్తితో రఘునాథ్ గొంతుపై దాడి చేశారు. తీవ్రం గాయం కావడంతో హాహాకారాలు చేస్తున్న అతనిని గమనించి గ్రామస్తులు పరుగున అక్కడికి చేరుకున్నారు. దీంతో దుండగులు పరారయ్యారు. బాధితుడిని ప్రాథమిక చికిత్స అనంతరం కొరాపుట్‌కు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి కుదుట పడుతున్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. పద్మణ హరిజన్, యుధిష్టర్ హరిజన్, బిజయ హరిజన్, ప్రధానిపుట్ గ్రామానికి చెందిన నర్సింగ హరిజన్, కార్తీక హరిజన్ లను నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేశారు. అయితే హత్యాయత్నానికి గల కారణాలు వెల్లడించలేదు.

శంకరాచార్యులతో మోహన్ భగవత్ భేటీ



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రముఖుడు మోహన్ భగవత్ పూరీ గోవర్ధన పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతితో ఆదివారం భేటీ అయ్యారు. పూరీ పర్యటన పురస్కరించుకుని జగన్నాథుని దర్శించుకున్న ఆయన.. శంకరాచార్యులతో భేటీ నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు. సనాతన ధర్మం విలువల పరిరక్షణ దిశలో నిరంతర కృషి అవసరంగా వీరివురి మధ్య భేటీ జరిగినట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి. - భువనేశ్వర్

పోలీస్ స్టేషన్ ముట్టడి



కల్యాణ సింగుపూర్ పోలీస్ స్టేషన్ వద్ద డొంగ్రియాలు



మొహరించిన పోలీసు బలగాలు

- సంప్రదాయ ఆయుధాలతో డొంగ్రియాల భారీ ర్యాలీ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పోలీస్ స్టేషన్‌ను డొంగ్రియా కొంధోలు ఆదివారం ముట్టడించారు. వారి సంప్రదాయ అస్త్ర, శస్త్రాలతో ఊరేగింపుగా వచ్చి.. పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసు బలగాలను మొహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా అదనపు ఎస్పీ విష్ణుప్రసాద్ పాత్రో ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అధ్యయనం చేశారు. ఆందోళనకారులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నియమగిరి పర్వత ప్రాంతాల్లోని డొంగిరియా తెగకు చెందిన లొంబా గ్రామంలో నివసిస్తున్న కృష్ణ సికక(34), బారి సికక లను పోలీసులు కలహండి జిల్లా లంజిఘడ్ లోని బజార్‌లో అరెస్ట్ చేసి తీసుకు వెళ్లడంతో వీరంతా ఆందోళనకు దిగారు. డొంగిరియా మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో కల్యాణ సింగుపూర్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అమాయకులపై తప్పుడు కేసులు బనాయించి, తరచూ అరెస్టులకు పాల్పడటంతో పాటు వేధిస్తున్నారని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం నియమగిరి పర్వత ప్రాంతాల్లో ఇదే తరహాలో కాంబేసు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను బిసంకటక్ పోలీసులు అరెస్ట్ చేసి, తీసుకు వెళ్లారన్నారు. పదే పదే తమను వేధిస్తుండటం సబబుకాదని విమర్శించారు. అరెస్ట్ చేసిన కృష్ణ, బారి లను తక్షణమే విడుదల చేయకపోతే, ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



పట్టుకున్న జూదరులతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: మండలంలోని గరికివలస శివారులో పేకాట స్థావరంపై ఎస్సై హరిబాబు నాయుడు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 18 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1,01600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాట, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి వివరాలు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

20 మద్యం సీసాలతో నిందితుడి అరెస్ట్



రేగిడి: పోలీస్‌స్టేషన్‌లో నిందితుడితో పాటు, మద్యం సీసాలను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: మండల పరిధిలోని మంగలపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న నిందితుడిని ఎస్సై ఇ.శ్రీనివాసరావు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర పట్టుబడిన 20 సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆకతాయిల ఆగడాలు

- హైస్కూల్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల చోరీ



హైస్కూల్ తరగతి గది తలుపులు పగుల గొట్టి గోడలపై ఉమ్మి పాడు చేసిన దృశ్యం

వేపాడ: మండలకేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఆకతాయిలు తరగతి గదుల తలుపు పగులగొట్టి గదులలో గోడలు పాడుచేయడంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు చోరీ చేస్తున్నారు. గత నెలలో నాలుగైదు పర్యాయాలు ఇలా జరగ్గా సుమారు 13 ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు చోరీకి గురయ్యాయి. నాడు నేడు పనులకు తెచ్చిన ఐరన్ చోరీకి గురికావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ చర్యలను నిరోధించాలని కోరుతున్నారు.

పూరిల్లు దగ్ధం



చామలాపల్లిలో అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఓ పూరిల్లు అగ్నికి ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మిగడ లక్ష్మీకాంతం వంటచేస్తూ ఎండుమిర్చికోసం దుకాణానికి వెళ్లింది. ఇంతలో మంటలు చెలరేగి తాటాకులకు అంటుకోవడంతో ఒక్కసారిగా ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మీకాంతం అప్పుగా తెచ్చుకున్న రూ.70వేలు, తులంన్నర బంగారం తాడు, కూలీనాలీ చేసుకున్న సొమ్ము రూ.పదివేలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో పాటు గ్యాస్ సిలిండర్ పైకి తీయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సమచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

కారు ఢీకొని బాలికకు తీవ్రగాయాలు

భోగాపురం: మండలంలోని గాబువానిపేట గ్రామానికి చెందిన బాలిక ఇప్పిలి హిమబిందు కారు ఢీకొని తీవ్ర గాయాలపాలైంది. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మూడవ తరగతి చదువుతున్న హిమబిందు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి రోడ్డు పక్కన ఆడుకుంటుండగా భోగాపురం నుంచి ముక్కాం వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. హుటాహుటిన బాలికను సుందరపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

అర్చకులకే ఆలయాలు



భామిని: ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి

- రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న వాటిని అప్పగించేలా నిర్ణయం
- ఈ కేటగిరీలో 394 ఆలయాలున్నట్లు అంచనా

మహారాణిపేట (విశాఖ దక్షిణ): దేవాలయ వ్యవస్థలో సమూల మార్పులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అర్చకులకు వంశపారంపర్య ధర్మకర్తల హక్కులు ఇవ్వడం, అర్చకుల జీతాలను పెంచడం, రెండు లక్షల రూపాయలలోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించారు. ఇప్పుడు రూ.5 లక్షలలోపు ఆదాయం వచ్చే ఆలయాలను అర్చకులకు అప్పగిస్తూ ఇటీవల మంత్రి వర్గం ఆమోదించింది. దీనిపై దేవదాయశాఖ కమిషనర్ మార్గదర్శక సూత్రాలు విడుదల చేశారు.

జిల్లా పేరు	నాన్ ఎసెస్‌బుల్.	6(సి).	6(బి)	మొత్తం దేవాలయాలు
శ్రీకాకుళం	39	43	05	87
మన్యంజిల్లా (పార్వతీపురం)	05	25	04	34
విజయనగరం	79	26	03	108
విశాఖ	33	11	-	44
అనకాపల్లి	76	36	06	118
అల్లూరి సీతారామ రాజు పాడేరు జిల్లా	03	-	-	03
	232	144	18	394

వివరాల సేకరణలో అధికారులు

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో రూ.5 లక్షల ఆదాయం వచ్చే ఆలయాలు, ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తల వివరాలను దేవదాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. భక్తులు సమర్పించే కానుకలతోపాటు ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసుకునే షాపుల నుంచి వచ్చే అద్దెలు, దేవాలయ భూముల మీద వచ్చే శిస్తులు, టికెట్ల విక్రయం ద్వారా ఆదాయం పరిగణనలోకి తీసుకుని ఏడాది ఆదాయాన్ని లెక్కిస్తున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మొత్తం 394 ఆలయాలున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

వివరాల సేకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.5 లక్షలలోపు ఆదా యం కలిగిన ఆలయాల వివరాలు తెలుసుకుంటున్నాం. త్వరలో దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.

– ఎస్.సుజాత, డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ, విశాఖపట్నం

హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సహాయ కమిషనర్ కార్యాలయంలో ఎవరెవరు ఏ ఆలయాల్లో పనిచేస్తున్నారో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి కమిషనర్‌కు నివేదిక పంపుతాం. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఆలయాల నిర్వహణ వారికి అప్పగిస్తాం. విశాఖ జిల్లాలో 33 ఆలయాలకు వంశపారంపర్య ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తలు ఉన్నారు.

– కె.శిరీష, సహాయ కమిషనర్ (అసిస్టెంట్ కమిషనర్) దేవదాయ శాఖ, విశాఖ జిల్లా

ఆదాయాన్ని బట్టి కేటగిరి విభజన

దేవదాయ, ధర్మాదాయ శాఖలో ఆదాయ వివరాలను బట్టి కేటగిరిగా విభజిస్తున్నారు. రూ 50 వేల లోపు ఆదాయం వచ్చే ఆలయాలను నాన్ ఎసెస‌బ‌ల్ కింద పరిగణిస్తారు. ఏడాదికి రూ.25 లక్షల నుంచి కోటి రూపాయలకుపైగా ఆదాయం వచ్చే ఆలయాలను 6ఎ కింద విభజిస్తారు. ఏడాదికి రెండు లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం వచ్చే దేవాలయాలను 6బి కింద, ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉంటే 6సి కింద విభజిస్తారు.

సీతంపేటలో పర్యాటకుల సందడి



క్లైంబింగ్ వాల్ ఎక్కుతున్న యువతి



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



బంజీట్రంపోలిన్ చేస్తున్న బాలిక

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో అడ్వెంచర్ పార్కు కళకళలాడింది. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడక, కయాకింగ్, బంజీట్రంపోలిన్, జెయింట్ వీల్ నడిపి ఆనందించారు.

ఐటీబీపీ కానిస్టేబుల్ అదృశ్యం



పట్నాల రాంబాబు, ఐటీబీపీ కానిస్టేబుల్

విజయనగరం క్రైమ్: ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కనబడడం లేదని కుటుంబసభ్యులు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనికి సంబంధించి ఎస్సై గణేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. హర్యానాలోని పాంచ్‌పూల్ జిల్లాలో ఐటీబీపీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పట్నాల రాంబాబు ఈ ఏడాది మే 22న 15 రోజుల పాటు సెలవు పెట్టి స్వస్థలం విజయనగరం సమీప సారిక గ్రామం వస్తున్నట్లు అధికారులకు చెప్పి వెళ్లిపోయాడు. అయితే నాటి నుంచి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులతో కాంటాక్ట్ కూడా లేకపోవడంతో సోదరుడు మహేష్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థిని ఆత్మహత్య

పార్వతీపురం: కొమరాడ మండలం రావికోనకు చెందిన కిల్లక స్వాతి(18) శనివారం రాత్రి పురుగు మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. స్వాతి ఇంట్లోనే పురుగు మందు తాగిన వెంటనే కుటుంబసభ్యులు కురుపాం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాత్రికేయ వృత్తి గౌరవప్రదం



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే26వ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- ఏపీయూడబ్ల్యూజే 26వ వార్షిక సర్వసభ్య సమావేశం



ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సాక్షి బ్యూరో ఎ.సూరిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: 'సమాజంలో పాత్రికేయ వృత్తికి గౌరవప్రదమైన స్థానం ఉందని' ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే 26వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండి ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి వార్తల సేకరణ చేసేది పాత్రికేయులేనన్నారు. సవాళ్లతో కూడుకున్న పాత్రికేయ వృత్తిలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కొన్ని అవాస్తవ వార్తలతో ఇబ్బందులు ఎదురవుతాయని, వాటిపై పాత్రికేయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా పాత్రికేయ రంగంలోకి వచ్చే వారు సీనియర్ పాత్రికేయులను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని చెప్పారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇంటి స్థలాల మంజూరుకు అర్హులైన జర్నలిస్టుల జాబితా అందించాలని సూచించారు. అలాగే యూనియన్ నాయకులు పాత్రికేయుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు కృషి చేయాలని కోరారు.

వారధిగా పాత్రికేయులు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పాత్రికేయ రంగం పనిచేస్తుందన్నారు. ప్రజాసామ్యంలో ప్రధాన భూమిక పత్రికా రంగానిదేనన్నారు. దేశంలో పాత్రికేయ రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారంలో పాత్రికేయుల కృషి మరువలేనిదన్నారు. కోవిడ్, హుదూద్ సమయాల్లో ప్రాణాలను పణంగా పెట్టి పాత్రికేయులు పని చేశారని ప్రశంసించారు. పాత్రికేయ మిత్రులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీలు ఐ.రఘురాజు, పి.సూర్యనారాయణ రాజులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు ప్రజల కోసం నిత్యం పనిచేస్తుంటారని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి అప్రమత్తం చేయడంలో పాత్రికేయుల కృషి మరువలేనిదన్నారు. తప్పు చేస్తే ఎత్తు చూపేది పాత్రికేయ రంగమేనన్నారు.

మృతుల కుటుంబాలు ఆదుకోవాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ కరోనా సమయంలో వృత్తిలో భాగంగా ఎంతో మంది పాత్రికేయులు మరణించారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేసేందుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ విజయనగరం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ సమాజాన్ని రూపుదిద్దడంలో పాత్రికేయులదే కీలకపాత్రని అన్నారు. పాత్రికేయులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందూ జనార్దన్, సామ్నా అధ్యక్షుడు నల్లి ధర్మారావు పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిపై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆచారి శివ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు డి.అచ్యుతరావు, ఎన్.ఈశ్వరరావు, కూన పాపారావు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా అల్లు సూరిబాబు

ఈ సందర్భంగా జెడ్పీ సమావేశం మందిరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా విజయనగరం సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వి.మహాపాత్రో (సూర్య), పంచాది అప్పారావు (పవర్), ఆరిపాక రాము (వార్త), బళ్ల మూడి నాగేంద్రప్రసాద్ (విశాలాంధ్ర), కార్యదర్శిగా ఎం.ఎస్ఎన్.రాజు (జిల్లా వాణి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేదుల సత్యనారాయణ (లీడర్), సహాయ కార్యదర్శిగా వి.అశోక్ (సీమాంధ్ర), సన్యాసిరావు (విశాలాంధ్ర), కోశాధికారిగా కుసుమంచి శ్రీనివాసరావు (హిందూ), మరో 18 మంది కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. ఎంపికైన సభ్యులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. అనంతరం 20 ఏళ్లుగా పాత్రికేయరంగంలో సేవలందించిన 125 మందికి పైగా సీనియర్ పాత్రికేయులను ఘనంగా సత్కరించారు.

హిమశ్రీ ప్రతిభ గర్వకారణం



హిమశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: లక్నోలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరానికి చెందిన టి.హిమశ్రీ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకోవడం మన ప్రాంతానికే కాకుండా, రాష్ట్రానికే గర్వకారణమని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారిణి హిమశ్రీని ప్రత్యేకంగా ఆయన అభినందించారు. స్థానిక కస్పా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని సెప్టెంబర్‌లో కేరళలో జరిగే సాయ్ లీగ్ పోటీలకు అర్హత సాధించిందని, అక్కడా విజయం సాధించి విజయనగరం ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీను యాదవ్, కార్పొరేటర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ప్రధాన ధ్యేయం సామాజిక సేవ

- రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు



వేదికపై రోటరీక్లబ్ ప్రతినిధులు

విజయనగరం: సామాజిక సేవ రోటరీ క్లబ్ ప్రధాన ధ్యేయమని రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని రింగ్ రోడ్డులో గల సుజాత కన్వెన్షన్ హాలులో ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ ప్రతినిధుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గవర్నర్ సుబ్బారావు ప్రసంగిస్తూ అంతర్జాతీయ స్థాయిలో విస్తరించి ఉన్న రోటరీ క్లబ్ ప్రథమ లక్ష్యం సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ అని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ఏటా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాలు నిర్మిస్తున్నామని వివరించారు. వీటితోపాటు పోలియో నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణాలలో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు లక్షలాది రూపాయలు వెచ్చించి సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సెమినార్‌లో రోటరీ మెంబర్‌షిప్ లక్ష్యంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఉన్న అన్ని క్లబ్‌లలో ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం క్లబ్ అధ్యక్షుడు వి.వి రాజేష్, అరుణ్ సొధాని, టీఎల్ఎన్ మూర్తి, యునైటెడ్ శ్రీనివాస్, జి.శివకుమార్, మడిపల్లి రామారావు, డాక్టర్ వెంటేశ్వరరావు, ఆర్ శంకర్‌రెడ్డి, అనీష్, బత్తుల చందు, కాపుగంటి రవి, మాటూరు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్సార్ మూర్తి మృతి తీరని లోటు



డాక్టర్ బీఎస్సార్ మూర్తి పాడె మోస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బీఎస్సార్ కుటుంబసభ్యులు



డాక్టర్ బీఎస్సార్ మూర్తి భౌతిక కాయానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు

- అంత్యక్రియల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎంపీ

గజపతినగరం: వైద్యరంగంలో విశిష్టమైన సేవలు అందిస్తూ మరో వైపు సామాజిక వేత్తగా పేరుప్రఖ్యాతులు గాంచిన డాక్టర్ బీఎస్సార్ మూర్తి మృతి తీరని లోటు అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు గజపతినగరంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. వారితో పాటు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి జెడ్పీటీసీలు గారతవుడు, రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాశ్‌లతో పాటు రేగిడి ఎంపీపీ అచ్చుంనాయుడు, తాడ్డి భాస్కరరావు, తాడ్డి రవి, డాక్టర్ వి.కృష్ణారావు, డాక్టర్ ఏఎల్.నాయుడు, చైతన్య భారతి కార్యదర్శి బొంతల కోటి శంకర్ రావు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథ రావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కర్రిరామునాయుడు, కర్రినానాజీ, సామంతుల పైడిరాజు, రేగ సురేష్, తదితర గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం వచ్చి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. అలాగే విజయనగరం ప్రేమ సమాజం, లయన్స్ క్లబ్, చైతన్య భారతి సభ్యులు, విజయనగరం జిల్లా వైద్య బృందం బీఎస్సార్ నివాస గృహానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేశారు. అనంతరం డాక్టర్ బీస్సార్ మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు.

కారు ఢీకొని బాలికకు తీవ్రగాయాలు

భోగాపురం: మండలంలోని గాబువానిపేట గ్రామానికి చెందిన బాలిక ఇప్పిలి హిమబిందు కారు ఢీకొని తీవ్ర గాయాలపాలైంది. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మూడవ తరగతి చదువుతున్న హిమబిందు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి రోడ్డు పక్కన ఆడుకుంటుండగా భోగాపురం నుంచి ముక్కాం వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. హుటాహుటిన బాలికను సుందరపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

విజయనగరం క్రైమ్: అయ్యన్నపేటకు చెందిన కట్టమూరి లక్ష్మి (55) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంక్షన్‌లో ఆమె రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని చిన్నారి..

మక్కువ: మండలంలోని ఆలగురువు గ్రామానికి చెందిన కర్ర ఆశిష్‌కుమార్(10) రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆశికుమార్‌ను ద్విచక్రవాహనంపై ముందు కూర్చుండబెట్టుకుని మక్కువ నుంచి గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో ఒడిశా రాష్ట్రంలోని నాగలబెడ్డ పంచాయతీ తనువులు గ్రామానికి చెందిన మెల్లిక పాపారావు ద్విచక్ర వాహనంపై మక్కువ వస్తుండగా బొడ్డు సామంత వలస గ్రామ మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆశిష్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో వెంటనే మక్కువలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై జి.పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి..

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురికాలనీకి చెందిన ముంతా వెంకటరమణ (56) మృతదేహం సీతయ్యచెరువులో ఆదివారం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ ఈ నెల 2 సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి కుమారుడు ప్రసాద్ అన్ని ప్రాంతాల్లో వెతకడంతోపాటు బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశాడు. ఆదివారం ఉదయం సెయింట్ ఆన్స్ ఆస్పత్రి వెనుకభాగంలోని సీతయ్య చెరువు వైపు వెళ్లి చూశాడు. చెరువు ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ ఉండడాన్ని గమనించి చెరువులో వెతకగా తండ్రి శవమై కనిపించాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలి



వల్లూరులో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం

నెల్లిమర్ల రూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని ఆ విభాగం చీపురుపల్లి సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి. సత్యనారాయణ సూచించారు. మండలంలోని వల్లూరులో ప్రకృతి వనరుల విక్రయ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఏ పంటకైనా చీడ, పీడలను నివారించేందు బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల యాంకర్ వర్రి గాయత్రి, యూనిట్ ఐసీఆర్పీలు అంబళ్ల రామలక్ష్మి, దుర్గారావు, కృష్ణంనాయుడు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఈఓగా వెంకటేశ్వరరావు నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వెంకటేశ్వరరావు నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఇన్‌చార్జి డీఈఓగా వ్యవహరిస్తున్న ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి నుంచి ఈయన పూర్తి అదనపు(ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. వెంకటేశ్వరరావు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావును డీవైఈఓలు, ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కేజీబీవీ విద్యార్థుల ఆచూకీ లభ్యం

బూర్జ: కొల్లివలస కేజీబీవీ నుంచి అదృశ్యమైన బాలికల ఆచూకీ హైదరాబాద్‌లో లభించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ కేజీబీవీ నుంచి బుధవారం రాత్రి ఇంటర్ విద్యార్థినులు ఇద్దరు అదృశ్యమయ్యారు. విద్యాలయం గోడ దాటి వెళ్లిన విద్యార్థులు సింగన్నపాలేం వరకు స్కూటీ లిఫ్ట్ అడిగి అక్కడ దిగిపోయి, శ్రీకాకుళం వెళ్లే బస్సు ఎక్కి ఆమదాలవలస చేరుకున్నారు. అక్కడి నుంచి ఫలక్‌నుమా రైలెక్కి విశాఖ చేరుకున్నారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లో ఉన్న వారి స్నేహితురాలు యమున ఇంటికి వెళ్లారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు మూడు బృందాలుగా బయల్దేరి విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. ఎస్ఐ బి.అశోక్‌బాబు బృందం హైదరాబాద్ వెళ్లి ఆ యువతుల బంధువు సాయంతో జీడిమెట్ల దగ్గర వారి ఆచూకీ తెలుసుకున్నారు. వారిని ఆదివారం బూర్జ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

'హరిత మార్పు కోసం కృషి'

రణస్థలం: ప్లాస్టిక్, పాలిథీన్ వాడకం నిర్మూలించి పర్యావరణ హితమైన గుడ్డ సంచులనే వాడాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. పైడిభీమవరంలోని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం అదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణ కోసం సమయం కేటాయిస్తే భవిష్యత్ తరాల్లో వచ్చే వేడి తాపాన్ని కొంతైనా తగ్గించవచ్చునని అన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు అభినందనీయమన్నారు. అనంతరం సామాజిక వేత్త, సినీ గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పశువులు మనం వాడి పారేసిన పాలథీన్ సంచులు తినడం వల్ల జీర్ణ సమస్యలతో చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ఆర్.హరిబాబు మాట్లాడుతూ పర్యావరణ రక్షణ దిశగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామని, భవిష్యత్ తరానికి మంచి వనరులను అందించాలనే తపనతో ఈ సంస్థ ఏర్పాటు చేశామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

ఎచ్చెర్ల క్యాంపస్ : పాత జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆదివారం అరసవల్లి ప్రాంతానికి చెందిన మహేష్ చిలకపాలేం నుంచి శ్రీకాకుళం వస్తున్నాడు. ఈ సమయంలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి వెళ్లే ఎస్ఎంపురం రోడ్డు సమీపంలో ఎచ్చెర్ల పరిధిలో రోడ్డుపై కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయాడు. తల రోడ్డుకు బలంగా ఢీ కొట్టినా హెల్మెట్ ఉండటంతో ఎటువంటి గాయాలు కాలేదు. కాళ్లకు మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సపర్యలు చేసి, ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు చేరుకొని ఆస్పత్రిలో చేర్పించారు.

ఎరువు రెడీ..!

- రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల పొజిషనింగ్‌లో సిక్కోలు ఫస్ట్
- ఖరీఫ్‌లో ఎరువులు, కాంప్లెక్స్ 52,000 మెట్రిక్ టన్నులు లక్ష్యం
- ఆర్‌బీకేల్లో 67 శాతం పొజిషనింగ్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అన్న పానీయాలు మానుకుని కార్యాలయం ముందు క్యూ కట్టే పని లేదు. రోజు వారీ పని వదులుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించే అగత్యం లేదు. అన్నదాతకు ఎరువు సులువుగా దొరికే మార్గాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రైతు భరోసా కేంద్రాలు వచ్చాక వ్యవ'సాయం' సులువైంది. ఒకప్పుడు విత్తనాలు, ఎరువుల కోసం యుద్ధాలు చేసిన రైతులకు ఈ కేంద్రాలు వరంలా మారాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచే రైతులకు అధిక ప్రాధాన్యత కల్పించింది. రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రతి గ్రామంలో ఎరువులు పుష్కలంగా ఇచ్చేందుకు వ్యవసాయ సీజన్ ప్రారంభానికే సిద్ధం చేశారు. ఆర్బీకేలు, సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్, ప్రైవేటు మార్కెట్ ద్వారా ఎరువులు రైతులకు అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

సిక్కోలే ఫస్ట్

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు, పురుగు మందులు 52,000 మెట్రిక్ టన్నులు అవసరం కాగా.. 26వేల మెట్రిక్ టన్నులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలకు లక్ష్యాలను నిర్ణయించారు. ఆర్‌బీకేల్లో అత్యధికంగా ఎరువులు, పురుగు మందుల పొజిషనింగ్‌లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులకు అన్ని రకాల సేవలను అందించేందుకు వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులు ఇప్పటికే రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు చేయడం కూడా ఇప్పటికే మొదలుపెట్టేశారు. వానలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆర్‌బీకేల వద్ద నుంచి రైతులు ఎరువులు తీసుకెళ్లి వ్యవసాయ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

పనితీరు బాగుంది



రైతుభరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు బాగా పని చేస్తున్నారు. దీంతో రైతులకు కావాల్సిన సేవలను అందిస్తున్నారు. రైతుభరోసా కేంద్రాలకు నిర్ణయించిన లక్ష్యాల్లో రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే శ్రీకాకుళం జిల్లా ఎరువుల పొజిషనింగ్‌లో మొదటి స్థానంలో నిలిచింది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. –
కె.శ్రీధర్, జిల్లావ్యవసాయాధికారి, శ్రీకాకుళం జిల్లా.



రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు అందిస్తున్న వీఏఏలు

డ్రాగన్ పండు.. ఆరోగ్యం మెండు

- జిల్లాలో 50 హెక్టార్లలో సాగు
- మార్కెట్‌లో మంచి గిరాకీ
- మొక్కల కొనుగోలుకు ప్రభుత్వ రాయితీ

శ్రీకాకుళం : డ్రాగన్ ఫ్రూట్.. కొన్నేళ్ల క్రితం వరకు సామాన్యులు చూడటమే తప్ప కొనుగోలు చేయలేని పరిస్థితి. విదేశాల నుంచి ఈ పండ్లు దిగుమతయ్యేవి. సుమారు దశాబ్ద కాలం క్రితం భారతదేశం నుంచి ఈ పంట సాగు మొదలైంది. శ్రీకాకుళం జిల్లాలో కూడా ఇప్పుడిప్పుడే సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఆరోగ్యం మెరుగుపడేందుకు ఔషధ గుణాలుండటంతో వీటిని తినేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో డ్రాగన్ పండు కిలో ధర రూ.350 వరకు పలుకుతోంది. ఇతర జిల్లాల నుంచి దీనిని దిగుమతి చేసుకోవడం వల్ల ధర ఎక్కువగా ఉంది. శ్రీకాకుళం నగరానికి చెందిన నరసింహరాజు అనే రైతు జలుమూరు మండలంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను తొలిసారిగా వేశారు. ఈయనకు మంచి ఫలితాలు రావడంతో మిగిలిన రైతులు కూడా సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ఉద్యానవనశాఖ పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం అందిస్తోంది. డ్రాగన్ పండు పండించే రైతులకు మొక్కల కొనుగోలుకు గాను హెక్టారుకు రూ.40 వేలు అందజేస్తున్నారు. ఈ రాయితీని వినియోగించుకుని సుమారు 30 హెక్టార్లలో డ్రాగన్ ఫ్రూట్ సాగవుతోంది. మరో 20 హెక్టార్లలో రైతులు తమ సొంత ఖర్చులతో పంటను వేసి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై అవగాహన లేకపోవడం వల్ల వీరు వినియోగించలేకపోతున్నారు.



జలుమూరు మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న డ్రాగన్‌ఫ్రూట్



మార్కెట్‌కుతరలించేందుకు సిద్ధం చేసిన డ్రాగన్ ఫ్రూట్ పండ్లు

పోషకాలు పుష్కలం..

డ్రాగన్ ఫ్రూట్‌ను తెలుగులో సిరిజమ్మెడ చెట్టు అని పిలుస్తారు.ఇందులో శరీరానికి అవసరమయ్యే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయి.శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడంతో పాటు ఆస్తమా తగ్గించుకోవచ్చు. చెడు కొలస్ట్రాల్ తగ్గి మంచి కొలస్ట్రాల్ పెరిగేందుకు, రక్తకణాలు పెరిగేందుకు డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగపడుతుంది. మధుమేహం ఉన్నవారు తింటే షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. బీపీని సైతం అదుపులో ఉంచుతుంది.

అన్ని నేలలూ అనుకూలమే..

డ్రాగన్ ఫ్రూట్ పండించేందుకు అన్ని రకాల నేలలు అనుకూలం కావడంతో సరుబుజ్జిలి, జలుమూరు, టెక్కలి, పాతపట్నం, హిరమండలం వంటి ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తున్నారు. ఎకరాలో పంట వేస్తే సుమారు రూ. 5 లక్షల వరకు వ్యయమవుతుంది. దీనికి నీటి అవసరం తక్కువ. పూత, కాయ వచ్చే సమయంలో మూడు నుంచి నాలుగు తడులు అందిస్తే మంచి దిగుబడిని పొందవచ్చు. ఒకసారి కాపునకు వచ్చాక 20 ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది. చెట్టుకు నాలుగు వైపులా గోతులు తవ్వి పశువుల ఎరువులను వేయాల్సి ఉంటుంది. చెట్టు నిటారుగా ఉండేందుకు నాలుగు పక్కలా స్తంభాలు గానీ, ఇనుప చువ్వలు ఆధారంగా మొక్కలకు కడితే మంచి దిగుబడిని సాధించవచ్చు.

జిల్లాలోనే విక్రయాలు..

ప్రస్తుతం సాగుచేస్తున్న రైతులు తమ దిగుబడులు జిల్లాలోనే విక్రయిస్తున్నారు. పండ్ల వ్యాపారం చేసేవారికి కిలో రూ. 200 నుంచి రూ. 220 వరకు అమ్ముతున్నారు. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తుంటే కిలో రూ.250 వరకు పడుతుంది. దీని వలన ఇటు వ్యాపారులకు అటు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. ప్రస్తుతం తక్కువ విస్తీర్ణంలో సాగు ఉండటం వల్ల జిల్లాలో విక్రయాలకే దిగుబడి సరిపోతుంది.

ప్రోత్సహించాలి..



డ్రాగన్ ఫ్రూట్ పంటను వేయడం వల్ల భారీ లాభం లేకపోయినా.. నష్టం అయితే రాదు. అధికారులు మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తే ఈ పంట నుంచి మంచి లాభాలొస్తాయి. ఈ పంట వ్యయ ప్రయాసలతో కూడుకున్నదయినప్పటికీ మార్కెట్ ఉంటే అదే స్థాయిలో లాభాలొస్తాయి.

– నరసింహరాజు, రైతు, శ్రీకాకుళం

సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి



జిల్లాలో 30 హెక్టార్లలో ప్రభుత్వ ప్రోత్సాహం అందుతున్న రైతులు పంటను సాగు చేస్తున్నారు. ఈ విస్తీర్ణం మరింత పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వచ్చే ఏడాది వంద హెక్టార్లలో సాగు జరిగేలా కృషి చేస్తున్నాం. మార్కెటింగ్‌పైనా దృష్టి పెట్టాం.

–ఆర్.వి.ఎస్.ప్రసాద్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి, శ్రీకాకుళం

కళా కార్మికుడు



వెండితెరపై అందంగా విరబూసిన ఎర్ర మల్లె ఆయన సినిమా. సామాన్యుడి కన్నీటి చుక్కే ఆయన కథకు చుక్కాని. కమర్షియల్ బాటలో వెళ్తున్న మెయిన్ స్ట్రీమ్ సినిమా నుంచి ఓ శాఖను విజయవంతంగా విప్లవ బాట పట్టించిన అరుదైన కళా కార్మికుడాయన. నాలుగు దశాబ్దాలుగా సినిమాలు తీస్తున్నా ఆడంబరాలు ఎరుగని పెద్ద మనిషి ఆర్.నారాయణమూర్తి. పీపుల్స్ స్టార్‌గా అభిమానులు ముద్దుగా పిలుచుకునే ఈ దర్శకుడు పేపర్ లీకేజీ ఇతివృత్తంతో యూనివర్సిటీ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.– శ్రీకాకుళం డెస్క్

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి: దశాబ్దాలుగా ఎన్నో సామాజిక అంశాలపై సినిమాలు తీసిన మీరు యూనివర్సిటీ చిత్రాన్ని తెరకెక్కించడానికి దోహదపడిన అంశాలేమిటి..?

నారాయణమూర్తి: కొన్నాళ్ల కిందట జరిగిన ఓ ఘటన ఈ చిత్రాన్ని తీసేందుకు నన్ను ప్రేరేపించింది. నా మిత్రుడి కొడుకు ప్రైవేటు కాలేజీలో చదవాలని ఆశ పడ్డాడు. అయితే పిల్లాడి తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో తన కిడ్నీ అమ్మి కొడుకును ప్రైవేటు కాలేజీలో చదివించాడు. అది నన్ను కలిచివేసింది. ఇలాంటి తండ్రులెందరో పిల్లల భవిష్యత్ కోసం కష్టపడుతున్నారు. విద్యార్థులు కూడా రేయింబవళ్లు శ్రమించి చదువుతున్నారు. కానీ ఇలాంటి వారి కష్టాన్ని అపహాస్యం చేస్తూ కొందరు పేపరు లీకేజీలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యుల పిల్లలు అన్యాయమైపోతున్నారు. అలాంటి బాధితుల కన్నీరే మా యూనివర్సిటీ చిత్రానికి ప్రేరకం.

సాక్షి: ఇప్పుడు సినిమా తీయడం ఒక ఎత్తైతే, దానికి ప్రచారం చేసి విడుదల చేయడం మరో ఎత్తు? ఈ సినిమా ప్రచారానికి ప్రత్యేక ప్రణాళికలు ఏమైనా చేశారా?

నారాయణమూర్తి: సినిమా విజయానికి ప్రచారమే ఇప్పుడు చాలా ప్రధానమైంది. అందుకే యూనివర్సిటీ చిత్రానికి బాగా ప్రచారం చేయాలనే ఉంది. ఈ సినిమా ప్రతి కుటుంబానికీ దగ్గరవుతుంది. అందుకే యువత కూడా నా సినిమాను ప్రమోట్ చేయాలని నా కోరిక.

సాక్షి: మీరు ఎప్పుడూ నూతన నటీనటులతో సినిమాలు తీస్తుంటారు. యూనివర్సిటీ సినిమాకు నటుల ఎంపిక ఎలా జరిగింది?

నారాయణమూర్తి : ఈ చిత్రాన్ని విజయనగరం, విశాఖ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించాం. విజయనగరం జేఎన్‌టీయూ నుంచి అలాగే అక్కడ ఉన్న సెంచూరియన్ యూనివర్సిటీల నుంచి విద్యార్థులను తీసుకున్నాం. వైజాగ్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకున్న నటులను కూడా ఎంపిక చేసి నటింపజేశాం.

సాక్షి: ఒకప్పుడు మీ చిత్రాలను తండోపతండాలుగా చూశారు. స్టార్ హీరోలతో సమానంగా మిమ్మల్ని ఆదరించారు. ఇప్పుడు ఆ ఆదరణ కాస్త తగ్గడానికి కారణాలు విశ్లేషిస్తారా?

నారాయణమూర్తి: ఒకప్పుడు నా సినిమాలు సిల్వర్ జూబ్లీలు ఆడిన మాట వాస్తవం. కానీ కొన్నాళ్లకు అందరూ నా తరహా సినిమాలనే తీయడంతో ఒక మొనాటనీ వచ్చేసింది. అది నా చిత్రాలపై ప్రభావం చూపింది. అయితే యూనివర్సిటీ సమకాలీన సామాజిక ఇతివృత్తంతో తీసిన సినిమా. ఇది అన్ని వర్గాలకు నచ్చుతుందని నా అభిప్రాయం.

సాక్షి: తమిళంలో జై భీమ్, కర్ణన్, మామన్నన్ వంటి చిత్రాలను చాలా ఏళ్ల కిందటే మీరు తెలుగులో తీసి చూపించారు. ఆయా సినిమాలకు రూ.కోట్లలో కలెక్షన్లు వచ్చాయి. మీ చిత్రం అలాంటి ఆదరణ పొందడానికి మీరు తీసుకున్న చర్యలు?

నారాయణమూర్తి: సామాజిక ఇతివృత్తాలపై సినిమాలు తీయడం గూడవల్లి రామబ్రహ్మం కాలం నుంచి ఉంది. ఇప్పటి తరం కూడా అద్భుతమైన సినిమాలు తీస్తున్నారు. అయితే జనం గొప్పవాళ్లు. వారు ముందుకు వచ్చి సినిమా చూస్తే నా సినిమాకూ గొప్ప ఆదరణ దక్కుతుందన్న ఆశ ఉంది.

సాక్షి: దాసరి నారాయణరావు వంటి దర్శకుడికి ఆర్.నారాయణమూర్తి వంటి నటుడు తోడైతే ఒరేయ్ రిక్షా వంటి సినిమా వచ్చింది. అదే నారాయణమూర్తి వేరే ప్రతిభావంతులైన దర్శకులతో కలిస్తే మరెన్నో మంచి సినిమాలు వస్తాయని జనం అభిప్రాయం. దీనిపై మీరేమంటారు?

నారాయణమూర్తి: నా వల్ల ఇతరులు ఇబ్బంది పడకూడదు అన్నది నా ప్రధాన ఉద్దేశం. నేను వారికి ప్లస్ అవ్వాలి గానీ మైనస్ అవ్వకూడదు. నేను మళ్లీ సక్సెస్ బాట పట్టాక దీని గురించి ఆలోచించవచ్చు.

సాక్షి: ఒక సినిమా విజయానికి ఆ చిత్రం ఆడిన రోజులు, కలెక్ట్ చేసిన డబ్బులు చాలా మందికి కొలమానం. కానీ మీ చిత్ర విజయానికి మీరిచ్చే కొలమానం ఏమిటి?

నారాయణమూర్తి: నేను ఎంచుకున్న అంశం జనాల్లోకి ఎంత బలంగా వెళ్లిందన్నదే నా కొలమానం. ఇలా నా సినిమాలు చాలా విజయవంతమయ్యాయి. యూనివర్సిటీ ఆ జాబితాలోకి చేరుతుందన్న నమ్మకం ఉంది.

సాక్షి: మీ ఆహార్యం, మీరు వాడే పాతకాలం మొబైల్ వంటివి మీ మనస్తత్వాన్ని సూచిస్తాయి. ఇప్పుడు ఓటీటీలు చాలా మంది చూస్తున్నారు. మీరూ చూస్తుంటారా?

నారాయణమూర్తి: నేను అవేమీ చూడనండీ. పాత సినిమాలే ఎక్కువగా చూస్తుంటాను. ఘంటసాల, జానకమ్మ, సుశీలమ్మ పాటలు వింటాను. ఇలా ఉండడమే నాకు ఇష్టం.

సాక్షి: ఇది విద్యా సంబంధిత సినిమా కదా. రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యా విధానాలపై మీ అభిప్రాయం ఏంటి?

నారాయణమూర్తి: ఆంధ్రాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంగ్లిష్ మీడియంపై ప్రవేశ పెట్టడం చాలా గొప్ప నిర్ణయం. ఇంగ్లిష్‌లో చదువుకోకపోవడం వల్ల నాలాంటి వారు ఎంతో మంది ఉద్యోగాలు రాక నష్టపోయారు. ఇంగ్లిష్ చదువుకుంటే సామాన్యుల పిల్లలు కూడా ఉన్నత స్థానాలకు ఎదుగుతారు.



సాక్షి: మీరు ఎన్నో విజయవంతమైన సినిమాలు తీశారు. ఎంతో డబ్బు సంపాదించారు. ఎంతో సేవ కూడా చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదా?

నారాయణమూర్తి: నాకు ఆ ఆలోచన లేదు. మనం ఎవరికీ హాని చేయకపోతే చాలు. ఇంకేమీ వద్దు. పంచభూతాలు ఏం కోరి మనకు అన్నీ ఇస్తున్నాయి. నేను చేసే పనులు కూడా అలాంటివే.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 83వ నెలవారీ సాహితీ సమ్మేళనం ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని పలువురు కవులు తమ కవితలు రాశారు. ఈ సందర్భంగా నిక్కు అప్పన్న (జణగణమని పాడరా) ఐఎన్‌డీ ప్రసాద్ (స్నేహమే నాజీవితం), యు.నాగేశ్వరరావు (పారిశుద్య కార్మికులు), ఇద్ది పాపయ్య (మాయనిగాయం), టి.ఎర్రమ్మ (స్నేహ తరంగం), ఆర్‌వీ రమణమూర్తి (స్నేహమంటే), లలితారెడ్డి (స్నేహాంజలి), ఎం.శ్రీనివాసరావు (స్నేహం), పి.లక్ష్మీనారాయణ (ప్రజా చైతన్యం), పొట్నూరు వెంకటరావు (ఓస్నేహితుడా), భొగెల ఉమాకవి (మాస్నేహం), బగాది వెంకటరావు (తేడా) బి.జనార్దన్‌రావు (రైతు ఘోష), ఎస్. ఈశ్వరరావు (అమ్మ మెదలె), ఎస్. బ్రహ్మాజీ (స్నేహ బంధం), సిహెచ్ శ్రీనివాసరావు (పచ్చని చేలు) కవితలను చదివారు.

ధిక్కార గళం.. బాధితులకు బలం



ఉద్దానంలో ఎగిరిన ఎర్ర జెండాలకు ఆయన పాట ఊపునిచ్చింది. ఆ కొండ కోనల్లో ప్రతిధ్వనించిన విప్లవ నినాదాలకు ఆ గొంతు పద సాయం చేసింది. ఉద్యమాల బాటలో ఆయన రాసిన విప్లవాల పాటలు ఓ తరాన్ని ఉర్రూతలూగించాయి. దశాబ్దాల పాటు బాధితుల తరపున పోరాడిన ఆ ప్రజా యుద్ధనౌక ఇప్పుడు విశ్రమించింది. ఆ ధిక్కార గళం శాశ్వత విశ్రాంతి కోరింది. చైతన్య గీతికకు చిరునామాగా నిలిచిన గద్దర్.. ఇక జ్ఞాపకమయ్యారు. ఆయన గురుతులు తలచుకుని సిక్కోలు కన్నీటి బొట్లను నివాళిగా అర్పించింది.

- గద్దర్ అస్తమయంతో సిక్కోలులో విషాదం
- ఉద్దానం ప్రాంతంతో విడదీయలేని అనుబంధం

పలాస, నరసన్నపేట, వజ్రపుకొత్తూరు రూరల్:

గద్దర్ అస్తమయంతో ఉద్దానంలో విషాదం అలముకుంది. 1969లో జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం తర్వాత ఈ ప్రాంతంలో గద్దర్ పాటలు మార్మోగాయి. ఉద్దానం ప్రాంతంలో 1985 నుంచి 1995 మధ్య కాలంలో అటు పీపుల్స్ వార్ ఇటు పోలీసులతో యుద్ధ వాతావరణం ఉండేది. అప్పట్లో పీపుల్స్ వార్ అమర వీరుల సభలకు కూడా గద్దర్ పోలీసు నిర్బంధాల మధ్య పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని, బీసీ వసతి గృహం మంజూరు చేయాలని, ఉద్దానం ప్రాంతానికి మంచినీటి సదుపాయం కావాలని తదితర డిమాండ్లతో బొడ్డపాడు ప్రజలు కాశీబుగ్గలో 1985లో అమరణ నిరాహార దీక్షలు చేశారు. ఆ సందర్భంగా ఆ ఉద్యమానికి మద్దతుగా మొదటిసారి గద్దర్ ఉద్దానం ప్రాంతంలో అడుగుపెట్టారు. పలాస, మందస, సోంపేట మండలాల్లో పెద్ద ఎత్తున జరిగిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ప్రదర్శనలు ఇచ్చా రు. ఆ తర్వాత అనేక సార్లు ఉద్యమ అవసరాలు రీత్యా గ్రామాల్లో పర్యటించారు. 1990లో వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో భారీ బహిరంగ సభ జరిగింది. ఆ సభలో గద్దర్ పోరు పాటలతో హోరెత్తించారు. తీరప్రాంతం జనసందోహమైంది. పీపుల్స్ వార్ ఉద్యమంలో చనిపోయిన వారి సంతాప సభలకు కూడా హాజరయ్యారు. ఈ విధంగా మందస మండలం బుడార్సింగి, మదనాపురం, అక్కుపల్లి గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామంలో 2005 ఆగస్టులో జిల్లా అమరవీరుల స్మారక స్థూపం నిర్మించారు. దాని ఆవిష్కరణ సభకు గద్దర్ హాజరయ్యారు. 'ఉద్దానం బిడ్డలారా వస్తారా... రారా' అంటూ ప్రజలను ఉర్రూతలూగించారు. చివరి సారిగి ఈ ఏడాది జనవరి 11న సంక్రాంతి సందర్భంగా పలాస మండలం నీలావతిలో జరిగిన సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కళా జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉద్దానం కంట నీరు పెట్టింది. ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్ష కార్యదర్శులు లండ రుద్రమూర్తి, నిశితాసి, సిక్కోలు జగదీష్, అందాల కోటీశ్వరరావు, కుత్తుం వినోద్, కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు సంతాపం తెలిపారు. అలాగే సిక్కోలు జానపద సాహిత్యకళావేదిక ప్రతినిధులు మల్లేన దేవరాజు, పాపారావు, బొడ్డు గాంధీ, దాసరి తాతారావు తదితరులు సంతాపం తెలియజేశారు. అలాగే నరసన్నపేట మాకివలస ఉన్నత పాఠశాలలో 1980లో నిర్వహించిన విరసం మహాసభల్లోనూ పాల్గొన్నారు. కోమర్తి గ్రామాన్ని సందర్శించారు.



చిన్ననీలావతిలో పాడుతున్న గద్దర్

మంచి కళాకారుడిని కోల్పోయాం



గద్దర్ మృతితో మంచి కళాకారుడిని కోల్పోయాం. జీవితమంతా ఆయన ప్రజా పోరాటాలకే అంకితం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

బాధగా ఉంది..




ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందడం బాధగా ఉంది. గడిచిన సంక్రాంతి సందర్భంగా ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ క్షణాలు గుర్తుకు వస్తున్నాయి.

– సీదిరి అప్పలరాజు, మంత్రి

6 సర్పంచులు, 96 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు

అరసవల్లి: జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో మొత్తం 6 సర్పంచ్ స్థానాలకు, 96 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్ని కల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈక్రమంలో విభజిత జిల్లాలోని మొత్తం 30 మండలా ల్లో 27 మండలాల్లో ఈ స్థానిక ఎన్నికల ప్రభావం ఉండనుంది. ఈ ప్రకారం ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు నామినేషన్ల పర్వం, ఈ నెల 19న పోలింగ్, వెంటనే కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్‌లు ఎన్నికల ప్రక్రియపై సన్నాహాలు చేస్తున్నారు. బొప్పడాం (సరుబుజ్జిలి), అక్కివరం (ఆమదాలవలస), పట్టుపురం (కోటబొమ్మాళి), అన్నాపురం (నందిగాం), భద్రి (సారవకోట), పెదలంకాం (బూర్జ) సర్పంచ్ స్థానాలతో పాటు 96 వార్డుస్థానాలకు ఎన్నికల జరగనున్నాయి.

ఉత్సాహంగా జిల్లా సీనియర్స్ జూడో ఎంపికలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి జూడో జూనియర్స్, సీనియర్స్ ఎంపిక పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. జిల్లా జూడో సంఘ కార్యదర్శి మొజ్జాడ వెంకట రమణ నేతృత్వంలో జిల్లా శాప్ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ ఈ ఎంపికలను నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఈ ఎంపికలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ బీవీ ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి ప్రారంభించారు. నెల్లూరు జిల్లా కేంద్రంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి బాలబాలికలు జూనియర్స్, సీనియర్స్ జూడో చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నా యి. ఎంపికైన క్రీడాకారులకు వారం రోజులపాటు శిక్షణ శిబిరాలను నిర్వహించి సన్నద్ధం చేయాలని ఆ సంఘ బాధ్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో జూడో అసోసియేషన్ ప్రతినిధులు, శాప్ జిల్లా వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ, డీఎస్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.